తారురోడ్డుమీద బొగ్గుట్రాన్స్‌పోర్టుచేసే లారీలు 'చిరచిర' శబ్దంచేస్తూ అటూ యిటూ పరుగెత్తుతున్నాయి. నైటుషిఫ్టు కార్మికులు తిరిగివస్తున్నరు. పొద్దటిడ్యూటీకి వెళ్లాల్సిన కార్మికులు వెళ్తున్నారు సైకిళ్లున్నవారు సైకిళ్లపైనా లేనివారుమాత్రం కాలీ నడకన ముందే బయలుదేరి అడ్డదోవలగుండా నడుస్తున్నారు.

నర్సయ్య, ఎల్లారెడ్డి, లింగయ్య రోడ్డుదిగి అడ్డుదోవగుండా తంగేడుచెట్ల లోంచి నడువసాగిండ్రు. ఎల్లారెడ్డి కాలు పట్టిపట్టివేస్తూ నడవడానికి అవస్తపడుతూ

"నర్సయ్యా.... బూట్లు బాగమండుతానయి" అన్నడు.

సైకిలుంటెనేమో జెర జెప్పసతగ్గు, కొన్నిరోజులు గిట్లనేవుండి కాయలు గాస్తయి. ఆయెంక తక్కువైతయి" అని వెనక్కుతిరిగి

"ఎల్లారెడ్డీ! అసలు బాయిపనిఅంటెనే బాంచెపని, నీతల్లి దీనంతలుచ్చపని దునియలగూడలేదు. యింత అరుపమోసుకష్టం యిన్నియిబ్బందులుపడుకుంట చేసే గాడ్దికొడుకు యింకెవడులేడు, వాడెవడో ఎంకటాద్రివచ్చి పాడినట్టు తెల్లారిలేస్తె అన్నిబాధలే" అన్నడు. అంతావిన్న ఎల్లారెడ్డి

"హా.. నర్సయ్యా దీనికంటె ఎగుసంజేసుడు సుఖంగుండె" అని వాపోయిండు.

ఎక్కడెపడులేక అక్కమొగుడు దిక్కైనట్టు - మాలసొంటోనికంటె గతిలేక అబ్బుడుకావట్టె. మరి నీకేంపైందయా? బంగారంవోలిగె "ఎగుసం"జేసుకబతుకక అని నర్సయ్య అంటె.

"ఎందుకులేదు. నాలసోంటోళ్లు యిద్దరుచేసినా దంగది. కనీఏంలాభం? గడియరికాములేదు గవ్వరాకడలేదు. అయ్యగారిసంపాదన అమ్మగారి పసుపుకుంకుమకు సరిపెయినట్టు. అండ్ల పండిందిలేదు పెయిందిలేదు. పొట్టకెల్లుడే బరిబ్బాగ కష్టంఅయితాంది" వ్యవసాయంలో తనఅనుభవం చెప్పిండు ఎల్లారెడ్డి.

"ఔనయ్యా రెడ్డి.... పురుగుపుట్టదిని పుట్టలుండబుద్దికాక నేనోఎకురం పొలం గొన్న. నీతల్లి అండ్లపండిందిలేదు పెయిందిలేదు. ఏటికేడు 'లుకాసే' అమ్మ కట్టపని సూత్తాన" అని తాను ఈమధ్య ప్రారంభంచేసిన వ్యవసాయం గురించి చెప్పిండు నర్సయ్య. లింగయ్య మవునంగ వారివెంట నడుస్తున్నడు. ముగ్గురూ తంగెళ్ళనుంచి బొగ్గుకుప్పల్లోంచి నడుస్తున్నరు.

"ఈ నెల జీతం ఎంత?" యథాలాపంగ నర్సయ్య అడిగిండు.

"నాలుగు వందలు" తక్కున చెప్పిండు లింగయ్య.

"నిన్నుగాదు రెడ్డిని అడిగిన" వెనకకుతిరిగి చెప్పిండు నర్సయ్య.

"నాదా ఆరువందలు" అన్నడు ఎల్లరెడ్డి. నర్సయ్య విచారిస్తున్నట్టు.... "మజ్దూర్ పనాయె.... ఫిలింగులంటె ఏడెనిమిదివందలు దొరుకు" అన్నడు.

"మాదొరుకు.... చాలనైసన్ని రోజులు ఫిల్లింగ్ సేత్తసనుకున్నగని.... రోజురిటనేనాసె గాబాధపల్లేక ఈ మస్టర్ పనికి వొప్పుకున్నగాదు" సంజాయిషిగ చెప్పుకున్నడు ఎల్లరెడ్డి.

"ఔ గాని రెడ్డి.... రోజు 'డిప్లరింగు'లకు ఎందుకత్తవు ? ఎటన్న 'ఎక్టింగ్' [2] కమాన్లకుపోరాదు." అన్నడు నర్సయ్య సలహాతీరుగ.

"కొన్నేళ్లకోసారి టర్మీషనిచ్చుకుంట అండర్ మేనేజరుసారు డిప్లరింగే తోల్తాండు" అన్నడు ఎల్లరెడ్డి.

"యింటికాడ ఎగుసంచేసినట్టు మొద్దుతీరుగసేత్తె ఎందుకు తోలడు ? అయితె వానెగసి, యాక్టింగు కడ్తాండా ?" అని అడిగిండు నర్సయ్య.

"యాక్టింగులేదూ మన్నూలేదు, గదేమజ్దూర్ జీతం" నిరాశగ అన్నడు ఎల్లారెడ్డి.

యాక్టింగుకడితె ఎంతలేదన్న యింకో నూరూరుపాయలు దొరుకు" నిట్టూర్చి అన్నడు నర్సయ్య. దానికి జవాబుగ ఎల్లరెడ్డి "పర్మనెంటు మజ్దూర్లలె యాక్టింగు కడ్తరటకద" అన్నడు. ఎల్లరెడ్డి చెప్పిందివిని భళ్లుననవ్వి "సీతల్లి భలేగున్నది. అటు టర్మీషనిచ్చుకుంట పర్మెంటుకానియ్యరు. యిటు ఏపనిచెస్తె ఆపని జీతం యాక్టింగు కట్టియ్యరు. సీతల్లి.... భలేదోపకం" అన్నడు నర్సయ్య.

"నూటడొంబై మస్టర్లువొస్తేగ్గ పర్మెంటు చెయ్యాన్నని రూలున్నదని యూనియ వోళ్ల పోస్టర్లేసిండ్రుకద" యూనియన్ రాజకీయాలు తెలియని ఎల్లరెడ్డి అమాయకంగ అడిగిండు. నర్సయ్య మల్లనవ్వి....

"సీతల్లి ముండమొయ్య కంపినే అంటె దానిజుట్లకెల్లి ఎల్లినోల్లు యూనియ నోల్లు. ఈమధ్య గసోంటిపనులుకూడ సేయించుతలేదు. ఎవడన్న గట్టిగ మాట్లాడితె నౌకరి పూడకోకిచ్చుడు పోలీసులకు పట్టిచ్చుడు. నౌకర్లుపెట్టిత్తమని వెయిలకు వెయిలు మింగికూకుండుడు. అంతకుదప్ప యిప్పుడు వాల్లేంజెయ్యలేరు" అన్నడు. ముగ్గురు

---

2. హెడ్డింగ్‌కమాన్ డెవలపింగ్ వర్కింగుప్లేసు.

"యింక జెరాగినంక అంటె మూడింటికి పోతట్నా ?" కదిలింది పోవర్ మ్యాన్ "ముండకొడుకులకు పిరికిసొచ్చింది" అన్నడు సర్దార్.

"ఏం వైందయా ? రమ్మంటె, బియ్యం అయిశాందటకద ఎవలకు ?" అని అడిగిండు.

"ముసురువడ్డట్టు గోపుల బండకూలనేవట్టె ప్యాలాలు ఏగినట్టు పక్కలనుంచి బొగ్గుపెళ్ళలు రాలవట్టె. పుట్టెడు బండకింద ఎట్లపన్జేసుడుసారూ ? ఓ ఏమ్మలేదు దాటు లేదు" రాయమల్లులేచి ఓచెయ్యి రొండికానించుకుని మరోచెయ్యి తిప్పుతూ అడిగిండు పోపర్ మ్యాన్ ముంగిసతీరుగ మూతిముందుకుసాపి "ఏం నువ్వొక్కనివే సేత్తానవా? షిఫ్టోడు సేసిపోలేదా ? నీతోటి నేనుంటలేనా ?" అని అడిగిండు.

"మావుంటరు మీకేంది? పిట్టబుర్రిమంటె బుట్టసంకసవెట్టుకోని వురికచ్చినట్టు కట్టెసంకసవెట్టుకోని వురికత్తరు." అన్నడు రాయమల్లు.

"గది గుర్రిం గిదిమైదానం.... ఆయంక మస్టర్లు కావాల్నంటె కుదుఽని పని" అన్నడు పోపర్ మ్యాన్,

గట్లంటె ఎట్లనయ్యో సారూ? ఎవరో గుంపులోంచి దీర్ఘంతీసిండ్రు.

"కాకుంటె నాగాలువెట్టుకోనిపోండ్రి" పోవర్ మ్యాన్.

నాగాలువెట్టుకోని పోవుటానికే అచ్చినమా ? అంతదూరం నుంచి మీతరీఖ కుటకుట మోటర్లమీద రాలేదు, ఈడ్చుకుంటీడ్చుకుంటచ్చినం." చాకలి మల్లయ్య మందిలోంచి అన్నడు.

"అత్తె రిటనుపొమ్మన్ననా ? పనిసూయించిన"

"బదిలీపిల్లరోల్లతీరుగ అయితె మమ్ముల్నిగూడ పటింటిదాక మీద బొగ్గు మోయించుకోని 'రిటన్' పొమ్మంటరు." అని ఎవరో అంటె బదిలీఫిల్లర్స్ పది మంది బితుకుబితుకుమని వొదిగివొదిగి కూర్చున్నరు.

"మీయిష్టమయ్యా !" చిరాకుపడి చెప్పిండు పోవర్ మ్యాన్.

"నీతల్లి యిట్టాలు యిట్టాలుఅని ఎవనికొంపలు ముంచుతరో ముంచనియ్. ఏంపన్నగావాలెగని, గిప్పుడెందుకు" అని చాకలిమల్లయ్య కోపంగలేస్తూ "పారాని మనపానానికి ఆయినపానం అడ్డంబెత్తడట !" అనుకుంట బయలుదేరిండు. ట్రాక్లు (లైట్లు) మంచిగలెవ్వని తిట్టుకుంట 'ఖాలీ' టబ్బులు దొబ్బుకుంట లోపలికిపోయిండ్రు.

"ఏంగోపు అచ్చుడురా తండ్రి! దిప్పరింగంటె ఏందో అనుకున్న". అతని కాళ్లు యింకా వణుకుతూనేవున్నాయి. వురికినప్పుడు తగిలిన దెబ్బలను పెతుక్కుని అమోటీన్ వేయించుకుంటున్నరు సర్దార్ చేత కొందరు కార్మికులు. తనను క్రింద పడవేసి తొక్కుకుంట వచ్చినందుకు కోపంగ శంకరయ్య వోవర్ మ్యాన్, "అది కూలుడుతక్కువ మీగాబర ఎక్కువ" అన్నడు. చాకలి మల్లయ్య అంటిన బొగ్గు దుమ్మును 'పుఫ్‌పుఫ్'మని వూదుకుంటూ "వానికేంది బాయిపనోడు, మారాజు అంటరు సచ్చిన సావెరుగక బతికిన బతుకెరుగక పుట్టెడు బండకింద అరువమోటు కట్టంచేసినా గని, పందలకు వందలు జీతాలత్తె తాగుతరని పేరుసేత్తరు, నీతల్లి యింత కట్టపడ్డా గుడిశెల్ల బతుకుతప్పదాయె" తపుక్కున వుమ్మివేసిండు.

"మరిగ పారాదుండ్రి" బుడుబుంగపిట్టతీరుగ మందలోంచి బయటకు వచ్చిన టింబర్ మ్యాన్ ఓదెలు.

"ఎక్కడికిరా ?" అడిగిండు నర్సయ్య.

"లోపల్కి దాటువెట్టుకుంట యిడ్సిపెట్టిఅచ్చినం" నవ్వుకుంట అన్నడు ఓదెలు.

"బిడ్డా! గిసోంటి దైర్నాలుసేత్తె నాశనమైపోతవ్. అంతగాడితె నా నాగాలన్ని రోజులుగాలె నువ్వు అపాయింట్ మెంటై" సురసురచూస్తు అన్నడు నర్సయ్య.

"ఏం నర్సయ్య ! లోపలికివెళ్లొద్దా ? యిటునుంచియిటే మీదికిపోదామా ?" అని వీర్రాజుగారు అన్నరు.

"పోదామా అంటె.... అవుతల వశంగాని గోఫ్అచ్చికూలె, లోపలికిపోయి సూసుకోవద్దాఏంది? ఏగిరపడ్తెఎట్ల ?" అన్నడు నర్సయ్య మొఖద్దమ్‌ను, వోవర్ మ్యాన్ను, నర్సయ్యను వుద్దేశించి అండర్ మేనేజరు.

"పదండిచూద్దాం" అని దారితీసిండు. నర్సయ్య వస్తున్న ఎల్లరెడ్డిని ఆపి "నువ్వీన్నేవుండు, మేంబోయి సూసిఅత్తం" అని మళ్ళ ఏదోయాదొచ్చినవాడితీరుగ వెనుకకుతిరిగి "మేంబోయినా వోతంగని, ఏవిట్లకు ఏంఅయింది మా బతుకంత ముందున్నది" అని "రాజేశ్వర్రావ్" అంటూ యిగ ఆ టింబర్ మ్యాన్ను పిలిచిండు జాగ్రత్తగ మూడు వర్కింగుప్లేసులు తిరిగిచూపిండ్రు. డయాగ్నల్‌గవున్న వర్కింగు ప్లేసుల్లో క్రింది లెవల్లోని వర్కింగుప్లేసు పూర్తిగ కనిపించకుండ కూలిపెయింది ఆధి కార్లవెంటే మెల్లగా వచ్చిన అమ్మోరుమచ్చల దుర్గయ్య వోలేళ్ళబెట్టి "బిడ్డో ! శవం ఎసుకైతె పేగులెల్లినత్తుమురో" అని బయటికే అన్నడు.

క్షణంకిందిదాక తమతో కలిసివున్న సోదర కార్మికులను శవాల రూపంలో చూస్తూ భయకంపితులై పోతున్నరు.

"అయ్యయ్యో ఎట్లజరిగింది ?"

"ఎక్కడజరిగింది ?"

"సైడుకూలిందా ?"

"టాపుకూలిం ?" పదులకంఠాలు అడుగుతున్నాయి. మరెందరో జవాబుకోసం ఎదురుచూస్తున్నరు. తెలిసినవాళ్ళు మరణించిన కార్మికులగురించి సానుభూతిగ....

"పాపం తల్లిదండ్రికి ఒక్కడేకొడుకు"

"యింటికాడ యింత ఎగుసాయంగూడవుండె"

"రేపోమాపో పెండ్లం పురుడువోసుకోనున్నది"

"అయ్యయ్యో ఎంతపని జరిగింది ?"

"గీనల్లపోరనికి మొన్ననే పెండ్లి అయిందిరాతండ్రి"

"ఎహె ఆగుండ్రి, మీయవ్వ, ఏడ్పులు. ఎట్లజరిగిందిరాఅంటె ఒక్కడు చెప్ప రేందిర ?" సెకెండ్‌షిఫ్ట్‌కోసం వచ్చిన ఒకకార్మికుడు ఆవేశంగ అడిగిండు. అమ్మోరుమచ్చలమొఖం చేవురించంగ కోల్‌ఫిల్లర్ దురుగయ్య....

"డిప్లరింగుల, బండకూలింది"

"డిప్లరింగుల్నా ? గీ అనుభవంలేనోళ్ళను ఎందుకుతోలిండ్రి ? టెంపరరో ళ్ళను డిప్లరింగు పంపద్దని తెలువదిరా వోర్మెన్లకు ?" ఎవరోకోపంగ. చాకలి మల్లయ్యలేచి ఆఫీసుగనిదిక్కు చూస్తూ, చూయిస్తూ "అగో, అండ్లకూకున్నడు పిల్లిగడ్డపు లం....కొడుకు వాన్నిఅడుగుండ్రి. ఈ యిద్దరు పోరగాండ్లను సావ గొట్టింది ఆ ఎరిజకండ్ల గాడ్దికొడుకే ? ఓ బద్మాష్ గాడ్దికొడుకా ! అవుతలమేయిన్ గోఫ్ కూలింది, ఫేసుల్ల సపోర్టులులేక బ్యాడ్‌రూఫ్‌లు అయితయి టైం అయింది పోతంఅంటె ఆ దొంగలట్టికొడుకు, "మీకు మస్టర్లెవరిత్తరో సూత్తనని ఈ పోర గాండ్ల తోలుకపొయ్యి బ్యాడ్‌రూఫ్‌కింద పన్జెయ్యవెట్టిండరా ! లేకపోతె బంగార మసోంటి పోరగాండ్లురా ! వాళ్ళకు సావెక్కడిదిరా :" అంటూ రెండుచేతులతో రొంబొచ్చె చరుచుకుంటూ అరిచిండు.

"బిడ్డా ! ఎంతపనిజరిగిందిరా ? తెలిసి తెలిసి పులినోట్లెకు తోలిండ్రురా",

